# అభాగ్యుడు

రచన :
శ్రీ జి. వి. భాస్కరరావు.

'వుంటాను బాబు! ఆరోగ్యం జాగ్రత్త! వెళ్ళగానే వుత్తరం వ్రాయి.'

రాయపూర్ ప్లాటుఫారంనుండి బండి బయలుదేరడానికి వ్యవధి రెండు నిముషాలు మాత్రమే.

గార్డు విజిలు వెయ్యటం, జండా చూపటం, కెనడియన్ ఇంజను గావుకేక వెయ్యటం క్షణాల్లో జరిగిపోయాయి.

అతను మాట్లాడలేదు. ఆమె కిటికీనుంచి బయటకు చూస్తూ ఇంకా అతని చేతిని వదల్లేదు. అతను తలవంచుకొని నిలబడ్డాడు.

ఆమె కళ్ళవెంట నీరు!

బండి బయలు దేరింది.

'వుంటానమ్మా!' అతను చెయ్యి వూపుతున్నాడు. ఆమె అతను కనుమరుగు అయ్యేవరకు చూసింది.

× × ×

ఇక చూడలేక పోయాడు సుధాకర్. ఆ దృశ్యం చూసేటప్పటికి అతని మనసు చాలా బాధపడింది.

'ఎంత వేగంగా ఇల్లుచేరుదామా, ఎంత తొందరగా అమ్మని చూద్దామా' అని అతని మనసు వువ్విళ్ళూరుతుంది.

మామయ్య వుత్తరం! 'అమ్మ ఆరోగ్యపరిస్థితి ఏమాత్రం బాగాలేదు. ఆమె నీకోసం బెంగిల్లి సగం అయింది. నువ్వు వెళ్ళిన నాటినుంచి ఆమె చిక్కి శల్యమై జీవన్మరణాల మధ్య కొట్టుమిట్టాడుతుంది. ఒకసారి రాగోర్తాను.'

'అమ్మా!' ఒకసారి మనసార వుచ్చరించాడు.

గతం—ఒకసారి అతని ముందు నాట్యం చేసింది.

× × ×

ఆ వుదయం సుధాకర్ ఎంత ప్రయత్నించినా సంబాళించుకోలేకపోయాడు. డాక్టరు తల్లికి పక్షవాతం అని చెప్పేసరికి పరిస్థితి ఆకళింపయింది. ఇలా రావటం రెండోసారి. డాక్టరు అన్నాడు, 'మరొకసారి వస్తే బ్రతకటం కష్టమని.'

ఎవరికి చెప్పుకుంటాడు పరిస్థితి.

నిరుద్యోగి, ఆదాయంలేదు. పెద్దలు ఆర్జించిన ఆస్థులు లేవు.

తల్లికి కాలు, చెయ్యి పడిపోయింది.

'పెళ్ళిచేసుకో నాయనా! కోడలు పిల్లను చూశాక—నిన్నో ఇంటివాణ్ణి చేస్తే—నేను చచ్చిపోయినా బాధలేదు.'

మృత్యువు ఆమె ముఖంలోంచి తొంగి చూస్తోంది.

అది స్పష్టంగా తెలుస్తోంది.

డాక్టరు ఫీజుకోసం కబురు 'ఇలా వుచిత వైద్యం చెయ్యలేను. చేస్తే త్వరలో మూటా, ముళ్ళు కట్టుకొని పోవాలి.

అతని రంగునీరు విలువ రూపాయలు!

మామయ్య అంటాడు మంచి వైద్యం చేయించమని.

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

ఆర్థికపరిస్థితి ముందే మందగించింది.

అమ్మకు బ్రతుకుమీద కొండంత ఆశ.

సాయంకాలం డాక్టరు రాలేదు.

రానన్నాడు.

విధి వికృతంగా నవ్వింది.

తల్లికి ఫిట్లు—పలవరింతలు.

సుధాకర్ ఖరువు. తల్లిని సాకలేక......

మర్నాటి వుదయం తల్లి ప్రశాంతంగా కనిపించింది.

'స్నేహితుడు - ఒక వుద్యోగం ఖాళీగా వుందన్నాడు...

తల్లి అంది 'నాకేం బాధలేదు! నువ్వెళ్లిరా నాయనా. అదిగో ఆ చీర చెంగున రూపాయి వుంది తీసుకో'

అమ్మ హృదయం అటువంటిది.

'పిన్నిగారు వచ్చి చూస్తారు — బాధ లేదు' ఆమె కళ్ళలో ఆశ.

మిలటరీలో చేరడానికి అన్ని విధాల తగిన బరువు, పొడుగువున్నాడు.

వెంటనే చేరాలన్నాడు ఆఫీసరు!

అమ్మకు అన్యాయం చేస్తున్నాడేమో!

ఇంటికిచేరి వుద్యోగం వచ్చిందన్నాడు తల్లితో.

ఆమె ముఖంలో శరశ్చంద్రుని కాంతి.

పాపం! ఆమెకేం తెలుసు.

ఆమెను ఏం చెయ్యటం. సహాయం లేకుండా ఆమె లేయలేదు - కూర్చోలేదు.

హృదయం ఎంత నవనీతమో అంత కఠినం కూడ.

తెల్లవారకట్ల - అందర్నీ విడిచి వెళ్ళిపోయాడు.

× × ×

సుధాకర్ రెప్పను ఆశ్రయించుకొని వున్న కన్నీటి బిందువు—తళుక్కుమని జారింది.

'ఏవూరు వెళతారు' ఎవరో ప్రశ్నస్తున్నారు.

'నాగపూర్'

అతని ఆలోచనలు మళ్ళీగతంలోకి జారబడ్డాయి.

× × ×

మామయ్య అన్నట్టు తను మూర్ఖుడే!

'కదల్లేని పరిస్థితిలో ఆమెను వదలి వెళ్ళటం ఎంత మూర్ఖమో ఆలోచించని నీచదువు ఎందుకు? ఇంక ఎక్కడా వుద్యోగం దొరకదని వెళ్ళావా? ఛీ! నీలాంటివాడు కొడుకని చెప్పుకోడానికి సిగ్గు! నీది మానవజన్మ జన్మ కాదు.'

ఆయన వాచకం అలా సాగిపోయింది.

మంచులో జీవన్మరణాల మధ్య సరిహద్దు కాపలా కాయటం సామాన్యం కాదు.

మనసు, శరీరం - అన్నీ కరడు గట్టుకుపోయాయి.

ఒకసారి 'అమ్మా!' అని అమ్మను కౌగలించుకుంటే—

ఎంత నీచమయిన పని చేశాడు తను.

కాలం సర్పం లాంటిది.

పగపడితే వదలదు.

పక్షవాతం తిరగ పట్టింది. మాటపడిపోయిందట!

విధికి ఎందుకో అంత కసి.

తల్లి క్షమించినప్పుడే జన్మకు నిష్కృతి.–

'అమ్మా!'.........

సుధాకర్ ఇంక ఆలోచించక లేకపోయాడు.

ప్రతి రక్త బిందువు అతన్ని వుద్వేగపరుస్తోంది.

నవమాసాలు మోసి, కని పెంచి—తండ్రి లేని లోటు కనబడకుండా-చదువుకు ఎక్కడ అభ్యంతరం కలుగుతుందో అని అహర్నిశలు శ్రమించి—శరీరంలోని ప్రతి రక్త బిందువు తనకోసం ఖర్చుచేసిన ఆమెకు తనుచేసిన వుపకారం ఏమిటి?

తెల్లవారి తల్లి ముఖం ఎలా చూడగలడు.

వుదయం ఏడుగంటలకు బండి దిగాడు.

భాస్కరం స్టేషనుకు వచ్చాడు.

ముందు గుర్తించటం కష్టమయినా సులభంగానే గుర్తించాడు.

'సుధా' భాస్కరం పిలిచాడు.

'అమ్మ ఎలా వుంది'

'బాగానే వుంది. నిర్లిప్తమైనసమాధానం.

ఇంటి ముందు జనం గుమిగూడి వున్నారు.

సుధాకరానికి గ్లాని హెచ్చింది కాళ్ళు తడబడ్డాయి. వీధిలో తల్లి శవం! – ఒకప్రక్క దహనానికి ఏర్పాట్లు!

'అమ్మా!' అంటూ జనాన్ని త్రోసుకొని ముందుకు పడిపోయాడు.

మేనమామ ముఖం త్రిప్పుకున్నాడు.

'కొడుకోసం కొట్టుకొట్టుకు చచ్చిపోయింది' జనాంతికంగా అత్తయ్య అంది.

సుధాకర్ భుజంమీద చెయ్యివేసి లేవతీశాడు భాస్కరం!

'వూరుకో సుధా!' ఆమె నిన్ను చూడ్డానికి నోచుకోలేదు.'

అతనికి మాటలు సమ్మెచేశాయి.

సుధాకరం తల్లి మృతదేహాన్ని చూస్తూనే వున్నాడు.

కళ్ళవెంట నీళ్లు కూడ లేవు.

తల్లి ముఖంమీద చిరునవ్వు గమనించాడు సుధాకర్!

అదే అతను చూసిన ఆఖరి చిరునవ్వు.

పండిత డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond 1898 1958 Jubilee
ఆయుర్వేదాశ్రమం(ప్రైవేట్)లిమిటెడ్,
మదరాసు-17.